క్లుప్తంగా

దేవాలయానికి ఇత్తడి పాత్రలు వితరణ



ఇత్తడి పాత్రను అందిస్తున్న భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయంలోని అమ్మవార్లకు ఆదివారం దాతలు ఇత్తడి పాత్రలు వితరణ చేశారు. నిత్య నైవేద్యం తయారు చేయడానికి అవసరమైన ఈ ఇత్తడి పాత్రలను గుర్రం సుజాత, యడ్లపల్లి వాణి, మోతె శోభ, తాళ్ళూరి రాజేశ్వరి, గుడిమెట్ల లలిత మహిళా భక్తులు అందించారు. భక్తులు దేవాలయ ప్రాంగణంలోనే అమ్మవార్లకు భోనం సమర్పించి ఆలయపూజారి సమక్షంలో దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఆర్థిక సాయం

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు పాలేరు శాసనసభ్యుడు కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ ఆర్థిక సాయం అందించారు. ఆదివారం మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించాక ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శాంత, పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ



రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో మున్నూరు కాపు యూత్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రంగ మిత్ర మండలి అధ్యక్షుడు పన్నాస పూర్ణచంద్రరావు, శెట్టి రంగారావు, గుండాల కృష్ణ, రాంప్రసాద్, సర్పంచ్ మాదంశెట్టి హరిప్రసాద్‌తో పాటు పూర్ణ, చెరుకూరి భిక్షమయ్య, తోట వెంకటేశ్వర్లు, హన్మంతరావు, దేవేందర్, యాసా రామారావు, అమరం నాగరాజు, శెట్టి సతీష్, బన్నీ సాయి, రాముడు పాల్గొన్నారు.

బైక్‌తో పాటు డీసీఎంను ఢీకొట్టిన కారు

కూసుమంచి: ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. ముందు వెళ్తున్న బైక్‌తో పాటు ఎదురుగా వస్తున్న డీసీఎంను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట నుండి ఖమ్మం వెళ్తున్న కారు కూసుమంచి వద్ద తొలుత ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పి డివైడర్ ఎక్కి ఎదురుగా వస్తున్న డీసీఎంను సైతం ఢీకొనగా కారు నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న వ్యక్తితోపాటు బైక్‌పై వెళుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా క్షతగ్రాతులను హైవే అంబులెన్స్‌లో ఖమ్మం తరలించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఆదిపురుష్
వినోద	స్పై
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	లవ్ యూ రామ్, ఈనగరానికి ఏమయ్యింది
శ్రీనివాస	ఇండియానా జోనెస్
సుందర్	నారాయణ అండ్ కో

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	94	బచ్చలికూర	2
వంకాయ	36		10
బెండకాయ	40	పాలకూర	3
పచ్చిమిర్చి	100		10
కాకర	60	చుక్కకూర	2
బీర	46		10
దొండ	36	తోటకూర	2
పొట్లకాయ	46		10
చిక్కుడు	80	గోంగూర	2
గోరుచిక్కుడు	36		10
క్యాబేజీ	24	మెంతికూర	5
క్యాలీఫ్లవర్	50		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	46		15
క్యారెట్	56	పుదీన	1
క్యాప్సికం	80		15

-ఖమ్మం వ్యవసాయం

మార్గం.. సుగమం



కొనసాగుతున్న వీవీపాలెం-వేపకుంట్ల రోడ్డు నిర్మాణ పనులు

వీ.వీ.పాలెం-వేపకుంట్ల రోడ్డుకు మహర్దశ

- రూ.5 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం
- శరవేగంగా సాగుతున్న పనులు
- లింగ్ రోడ్లు.. డబుల్ రోడ్లుగా విస్తరిస్తున్న వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

రఘునాథపాలెం: ఇప్పటి వరకు సింగిల్ లైన్ రోడ్డుగా ఉన్న వీ.వీ.పాలెం-వేపకుంట్ల రోడ్డుకు మహర్దశ పట్టింది. గత కొన్ని రోజులు నుంచి రూ.5 కోట్ల నిధులతో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యాన నిర్మిస్తున్న డబుల్ లైన్ తారు రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే మండలంలోని అనేక గ్రామాల లింక్ రోడ్లు అభివృద్ధి చేసుకోవడంతో పాటు ప్రధాన గ్రామాల లింక్ రోడ్లు డబుల్ రోడ్లుగా విస్తరిస్తున్నారు. అంతేకాక మేజర్ గ్రామ పంచాయతీల్లో ప్రధాన అంతర్గత రహదార్లను సైతం విస్తరించి సెంట్రల్ డివైడర్లు నిర్మించడంతో పాటు లైటింగ్ ఏర్పాటు చేసి మరింత అభివృద్ధి చేస్తున్నారు.

రూ.4 కోట్లతో డొంక రోడ్ల అభివృద్ధి..

మండలంలోని వ్యవసాయ పోలాలకు రాకపోకలు సాగించే డొంక రోడ్లను గతంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యాన రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయించారు. ప్రస్తుతం కొన్ని పూర్తి కాగా.. మరికొన్ని పనులు కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలను బాహ్య ప్రపంచంతో అనుసంధానం చేయాలనే ఉద్దేశంతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి.. పల్లెలకు వెళ్లే రహదారులను బీటీలుగా మారుస్తూ నూతన శోభ తీసుకొస్తున్నారు.

రూ.15.72 కోట్లు.. 25 కిలో మీటర్లు..

గతంలో కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎంజీఎస్‌వై పథకం ద్వారా మండలంలో సుమారు 25 కిలోమీటర్ల పరిధి వరకు డబుల్ లైన్ రోడ్లు విస్తరించేందుకు రూ.15.72 కోట్లు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించారు. తాజాగా మండలంలోని వేపకుంట్ల ప్రధాన రహదారిని రెండు వరుసలుగా నిర్మించేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.5 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. దీంతో వీవీపాలెం ఎన్నెస్పీ కాల్వ బ్రిడ్జి నుంచి మొదలుకొని వేపకుంట్ల మీదుగా గణేశ్వరం గ్రామ సమీపానికి సుమారు 3.5 కిలో మీటర్లు దూరంతో సింగిల్‌గా ఉన్న రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వేపకుంట్లలో చెరువుకట్టను సైతం విస్తరించి డబుల్ లైన్‌గా మార్చనున్నట్లు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

డబుల్ రోడ్డుతో మేలు..



వీ.వీ.పాలెం నుంచి చింతగుర్తి వరకు సింగల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్పు చేయడం వలన రవాణాపరంగా ఎంతో మేలు జరుగుతుంది. గతంలో ఎదురుగా వాహనాలు ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురయ్యేవారు. రోడ్డు మార్జిన్ లేక వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడ్డాం.

– మెంటం రామారావు, సర్పంచ్, చింతగుర్తి

సమస్య తొలగినట్లే..



మా గ్రామానికి వచ్చే రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మిస్తుండడంతో అనేక గ్రామాలతో ప్రజలకు రవాణాపరంగా ప్రయోజనం చేకూరుతుంది. నిత్యం ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇప్పుడు ఆ సమస్య తీరింది.

– దారా శ్యామ్, సర్పంచ్, వేపకుంట్ల

సాయి మందిరంలో వ్రతం

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా నగరంలోని గాంధీచౌక్ శ్రీ వర ప్రదాత షిర్డీ సాయి మందిరంలో ఆదివారం 150 మంది దంపతులచే శ్రీ సాయి సత్యవ్రతం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయినాథుడికి పంచామృతాలు, నదీ జలాలు, పండ్ల రసాలతో అభిషేకం చేశారు.తర్వాత బాబాను అలంకరించి విశేషార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీమవరానికి చెందిన పిప్పళ్ల ప్రసాదరావుచే ధ్యానరతి, ధ్యానగానాన్ని ఆధ్యాత్మిక సంకీర్తనలను వినిపించారు. ఈ కార్యక్రమాల్లో మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సత్య సాయి వ్రతాన్ని చేస్తున్న భక్తులు

సుగంధ ద్రవ్యాలతో అభిషేకం..

నగరంలోని త్రీటౌన్ రంగరాయకులగుట్టపై ఉన్న శ్రీ కృష్ణ సాయి ఆశ్రమంలో ఆదివారం సాయినాథుడికి నవరత్నాలు, సుగంధ ద్రవ్యాలతో పాటు కనకాభిషేకం చేశారు. తర్వాత ఉత్సవ మూర్తికి అన్నాభిషేకం చేశారు. దేవతా ప్రీతి, సకల హోమ పరిపూర్ణసిద్ధి కోసం పూర్ణహుతి వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆశ్రమం కమిటీ చైర్మన్ లగడపాటి రామారావు, కార్యదర్శి సిద్దంశెట్టి నాగమణి, మార్త నరసింహారావు, బిజినేపల్లి సుదర్శన గుప్తా తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ సాయి ఆశ్రమంలో అభిషేకం చేసేందుకు వెళ్తున్న భక్తులు

స్వీపర్ల దీక్షకు సీపీఎం సంఘీభావం



సంఘీభావం ప్రకటిస్తున్న సీపీఎం నాయకులు

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే స్వీపర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పాలేరు డివిజన్ నాయకుడు ఏటుకూరి రామారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో స్వీపర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం రెండో రోజు చేరడంతో దీక్షకు పార్టీ సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వీపర్లతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. నెలకు రూ.27 వేల వేతనం చెల్లించాలని, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఓ 45 ప్రకారం తొలిగించిన స్వీపర్ల స్థానంలో వారి కుటుంబసభ్యులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, నాయకులు మండడపు మురళీకృష్ణ, స్వీపర్ల సంఘం నాయకులు ఖాదర్ బాబు, రాంబాబు, సుక్రియ, రాములు, చారి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

నేలకొండపల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6 నుంచి చేపట్టబోయే సమ్మెను విజయవంతం చేయాలని సీటు జిల్లా నాయకుడు ఏటుకూరి రామారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం పంచాయతీ వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే మల్టీ పర్పస్ వర్కర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రూ.19 వేల వేతనం అందించాలని, పంచాయతీ కార్మికులకు అన్ని కార్మిక చట్టాలను వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమ్మెకు పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, రాజకీయ పార్టీల నాయకులు మద్దతు కోరాలని సూచించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, పి.బాబు, బొడ్డు ఆంజనేయులు, కస్తాల గోపయ్య, పి.నాగరాజు, సైదులు, అనిత, కందుల బాబు, రామ్‌తుల్లా, రామారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



వైద్యులను సన్మానిస్తున్న నూతన లయన్స్ క్లబ్ కమిటీ

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నగరంలోని లయన్స్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కమిటీ అధ్యక్షుడు తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, కార్యదర్శి వేముల హన్మంతరావు, కోశాధికారి గుడిపుడి జనార్ధన్‌లను పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ యానాల మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ మేరకు ఐదుగురు డాక్టర్లు, ఒక చార్టర్డ్ అకౌంటెంట్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్-2 నంబూరు మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దేవుడా.. పాడిపంటలు బాగుండాలి

రఘునాథపాలెం: పాడి పంటలు బాగుంటేనే ఊరు.. ఊరులోని ప్రజలు బాగుంటారని అందు కోసం వానలు బాగా కురవాలని మండలంలోని వేపకుంట్ల గ్రామానికి చెందిన 40 మంది కూలీలు దేవుళ్లను మొక్కుతున్నారు. గ్రామానికి చెందిన బాలిన రమాదేవి అనే ముఠా మేస్త్రి ఆధ్వర్యాన మహిళలు ముఠాలుగా ఏర్పడి నేడు(సోమవారం) శ్రీశైలం దేవాలయం, బ్రహ్మగారి మఠం, విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయాల్లో మొక్కులు చెల్లించడానికి తరలి వెళ్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ దేవతలకు గత వారం క్రితం బోనాలతో మొక్కులు చెల్లించారు. ప్రతి ఏటా ఒక పుణ్యక్షేత్రాన్ని ఈ ముఠా దర్శిస్తారు. గతంలో తిరుపతి, మేడారం, గుబ్బల మంగమ్మతల్లి తదితర దేవాలయాలకు వెళ్లి అక్కడ రైతులకు తరపున పూజలు చేసి ప్రసాదాలను తీసుకొచ్చి రైతులకు అందించారు. కూలీలు సుజాత, చెన్న రేణుక, నాగమణి, ముతమ్మ, సుశీల, ఉమా ఆదేమ్మ కూలీలు ఉన్నారు.



ముఠాగా బయలుదేరి వెళ్తున్న మహిళలు (ఫైల్)

వీరన్న స్వామికి భక్తుల పూజలు



పూజలు చేస్తున్న తండావాసులు

కూసుమంచి: మండలంలోని లోక్యాతండావాసులు ఆదివారం కూసుమంచి రోడ్‌లో ఉన్న వీరన్న ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం తండావాసులందరూ ఈ ఆలయంలో మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో మహిళలు బోనాలు చెల్లించగా.. పొట్టేళ్ల, కోళ్ల బలిచ్చి మొక్కులు చెల్లించారు.

ప్రభంజనం

జనగర్జన సభకు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ముగింపుతో పాటు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన జనగర్జన సభ సక్సెస్ అయింది. . ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మండలాల నుంచి పార్టీ శ్రేణులు ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై పార్టీ జెండాలు చేతబూని ర్యాలీలు నిర్వహించి సభకు భారీగా తరలివెళ్లారు. సభికులు అంచనా వేసిన మేరకు జనం తరలిరావడంతో సభా ప్రాంగణమంతా హోరెత్తింది. జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేస్తూ సభకు తరలివెళ్లడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. కాగా ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారి వాహనాలు, జనాలతో కిక్కిరిసిపోయింది. ఊహించని స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు సభకు తరలివెళ్లడం పట్ల కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. – సాక్షినెట్‌వర్క్





బతుకమ్మలతో చిన్నారులు



తిరుమలాయపాలెంలో..



కూసుమంచి: నాయకన్‌గూడెం నుంచి ర్యాలీగా సాగుతున్న ఆటోలు



నేలకొండపల్లి: అనంతనగర్‌లో ర్యాలీగా..



తిరుమలాయపాలెంలో కాంగ్రెస్ కార్యకర్తల కోలాహలం



కూసుమంచి: ర్యాలీగా కదులుతూ..

సీపీఐ, కాంగ్రెస్ జెండాలతో సభకు..



రెండు జెండాలతో రాములు

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాకు చెందిన సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి భూక్యా రాములు సీపీఐ, కాంగ్రెస్ జెండాలను బైక్‌కు కట్టుకుని ఆదివారం జనగర్జన సభకు హాజరయ్యాడు. తాను సీపీఐ అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మీద అభిమానంతో కాంగ్రెస్ జెండాను పట్టుకుని సభకు వెళ్తున్నట్లు రాములు తెలిపాడు. నేలకొండపల్లిలో బైక్‌పై రెండు జెండాలతో చక్కర్లు కొడుతున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. సభకు వెళ్తున్న వారి దృష్టంతా రాములుపైనే ఉంది.


కాల్వలో నుంచి బయటకు..



సాగర్ కాల్వ నుంచి బయటకు వెళ్తున్న ప్రజలు

ఖమ్మంస్పోర్ట్స్/ఖమ్మంక్రైం: జనగర్జన సభకు వచ్చిన ప్రజలు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో సాగర్ కాల్వలోంచి నడుచుకుంటూ వెళ్లారు.

బస్తాల్లో వాటర్ ప్యాకెట్లు ..



వాటర్‌ప్యాకెట్ బస్తాలను తీసుకెళ్తున్నకార్యకర్తలు

ఖమ్మంఅర్బన్: జనగర్జన సభకు వచ్చిన వారు దాహం తీర్చుకునేందుకు వాటర్‌ప్యాకెట్లు ఉన్న బస్తాలను తీసుకెళ్లారు. తమ వాహనాల్లో పెట్టుకుని తాగడం కనిపించింది.

ఆకట్టుకున్న బెలూన్లు, హోరెత్తిన నినాదాలు..

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిక సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఏర్పాటు చేసిన బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బెలూన్లపై రాహుల్ గాంధీ, ప్రియాంకగాధీ, రేవంత్‌రెడ్డి, పొంగులేటి ఫొటోలు ఏర్పాటు చేశారు.అలాగే సభా ప్రాంగణంలోనే హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. రాహుల్‌గాంధీ విజయవాడ నుంచి సాయంత్రం 5.45 గంటలకు రావడంతో 'జై కాంగ్రెస్.. జై రాహుల్'అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.



సభా ప్రాంగణంలో ప్రత్యేకంగా నిలిచిన బెలూన్లు

ఎల్ఈడీల్లో వీక్షణం..



ఎల్ఈడీ ద్వారా భట్టి ప్రసంగాన్ని వీక్షిస్తున్న కార్యకర్తలు

ఖమ్మంఅర్బన్: లక్షలాది మంది జనగర్జన సభకు తరలిరావడంతో సభావేదిక వద్దకు పోలేకపోయారు. దీంతో అక్కడ ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లలో వక్తల ప్రసంగాలను వీక్షించడం కనిపించింది.